ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 36.0 | కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
బుధవారం 5 మార్చి 2025



గుప్తనిధుల కోసం నరబలి అవాస్తవం

7



రంజాన్ వేళలు

ఇఫ్తార్(బుధవారం-6:32)

సహర్ (గురువారం-5:11)

ఏ క్షణంలోనైనా..

గల్లంతైన కార్మికుల ఆచూకీ తెలిసే అవకాశం



లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్తున్న రెస్క్యూ బృందాలు

- ఎస్ఎల్‌బీసీలో టన్నెల్‌లో కన్వేయర్ బెల్టు సిద్ధం
- వ్యర్థాలు, బురద మట్టి వేగంగా తరలింపు
- షిఫ్టుకు 60 మంది చొప్పున నాలుగు షిఫ్టుల్లో పనిచేస్తున్న రెస్క్యూ బృందాలు
- గంటకు 800 టన్నుల మట్టి బయటికి.. లోకోతో టీబీఎం వ్యర్థాలు కూడా..
- మళ్లీ ప్రమాదం జరగకుండా చూసేందుకు చేరుకున్న సెంటర్ ఫర్ సిస్మాలజీ బృందం
- జీపీఆర్ ద్వారా గుర్తించిన ప్రాంతాల్లో కొనసాగుతున్న బురదమట్టి తవ్వకాలు

మహబూబ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగి లోపల ఎనిమిది మంది కార్మికులు చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 11 రోజుల సమయం పూర్తయ్యింది. కానీ కార్మికుల ఆచూకీ లభించలేదు. టన్నెల్‌లోని కన్వేయర్ బెల్టును మంగళవారం సిద్ధం చేయడంతో సహాయక చర్యలు పుంజుకోనున్నాయి. సహాయక చర్యల్లో సుమారు 700 మందికిపైగా సిబ్బంది పాల్గొంటున్నారు. అయినప్పటికీ.. లోపల పరిస్థితి సంక్లిష్టంగా ఉండటం, ఊటనీరు ఉబికి వస్తుండటం, వ్యర్థాలు, బురదమట్టిని బయటకు తరలించే అవకాశం లేకపోవడం, సెగ్మెంట్ బ్లాకుల కింద ఉన్న మట్టిని తొలగిస్తే మళ్లీ కూలే ప్రమాదం ఉండటంతో పనులు ఆలస్యం అయ్యాయి. దాదాపు ఆరు రోజులు గడిచిన తర్వాత లోపల గ్యాస్ కట్టర్లు, ప్లాస్మా కట్టర్లు ఉపయోగించి ఐరన్ షీట్లు, టీబీఎం మిషన్ భాగాలను కట్ చేయడం ప్రారంభించారు. చిన్న చిన్న కంటెయినర్ల ద్వారా డెబ్రీస్, మాల్వను బయటకు తరలించడం ప్రారంభించారు. ఇందులో అత్యంత కీలకమైన మట్టి తరలింపునకు ఉపయోగపడే కన్వేయర్ బెల్టు ప్రమాదం తీవ్రతకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర దెబ్బతింది. ముందుగా కార్మికుల ఆచూకీ తెలిసిన తర్వాత కన్వేయర్ బెల్టును ప్రారంభిద్దామని

(మిగతా 6లో..)

పనులు నిలిపివేయడమే

ప్రమాదానికి కారణమా?

- శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో పనులు ముందుకు సాగేనా? 6
- భయంతో సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ బృందాలు



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగిన చోట 2019లో బయట పడిన నీటి ఊట ప్రాంతం



జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో కౌసర్‌జహాన్

విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కేంద్రాలకు విద్యార్థులకు 15 నిమిషాలు ముందే చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 124 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 65,219 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల డీఐఈవోలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అన్ని కేంద్రాల్లో వసతులు కల్పించారు. పరీక్షల నిర్వహణకు ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ప్రత్యేక, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో కౌసర్ జహాన్ పరిశీలించారు. ఈ ఏడాది హాల్ టికెట్లపై బోర్డు అధికారులు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు.

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల్లో తాగునీరు, వైద్య సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలి. చివరి నిమిషంలో వచ్చి ఒత్తిడికి గురికావద్దు.

- కౌసర్ జహాన్, డీఐఈవో, మహబూబ్‌నగర్ జిల్లా

లోపలి పేజీల్లో..



కండక్టర్ వైర్ కోసం నిరీక్షణ

- డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా అందించని అధికారులు
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రైతులు

7



చెత్త సేకరణ విధానంపై శిక్షణ

- ఉమ్మడి జిల్లా మునిసిపల్ అధికారులు, సిబ్బంది హాజరు

7



మధ్యాహ్న భోజనంలో పురుగులు

- ఆందోళనకు దిగిన విద్యార్థులు

7

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర



మహిళా కార్మికులతో కేక్ కట్ చేయిస్తున్న ఇందిర

మహబూబ్‌నగర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): 'మహిళలపై ఎన్నో రకాల దాడులు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. వాటినుంచి రక్షణ కోసం ఎన్నో చట్టాలున్నాయి. వాటిపై ప్రతీ మహిళకు అవగాహన ఉండాలి' అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 ప్రకారం లైంగిక వేధింపులు అనేది స్త్రీల ప్రాథమిక సమాన హక్కులను ఉల్లంఘిస్తుందన్నారు. మహిళలు వీటిని ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. ప్రతీ కార్యాలయంలో 10.. అంతకన్నా ఎక్కువ మంది ఉద్యోగులతో ఉన్నా.. పని ప్రదేశంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవా అధికార సంస్థను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులను ఎదుర్కోడానికి 2013లో పోష్ చట్టం తేవడం జరిగిందన్నారు. ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా కార్మికులతో కేక్ కట్‌చేయించారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో.. మరో జాతీయ స్థాయి టోర్నీ

- ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహణ
- అండర్-19 క్రికెట్ పోటీల నిర్వహణకు ఎస్‌జీఎఫ్ నిర్ణయం
- రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ కూడా ఉమ్మడి జిల్లాకు కేటాయింపు



జనవరిలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్-19 హ్యాండ్‌బాల్ టోర్నీలో తలబడుతున్న ఆయా రాష్ట్రాల క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి); మహబూబ్‌నగర్ నగరం మరో మారు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. ఏడేళ్ల తరువాత జనవరిలో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-17 బాల, బాలికల టోర్నీ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండోసారి జాతీయ స్థాయి పోటీలకు నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయ స్థాయి బాలుర క్రికెట్ టోర్నీని మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది.

ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు

ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయ స్థాయి బాలుర క్రికెట్ టోర్నీని వచ్చే నెల ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు వివిధ జాతీయ విద్యా సంస్థల నుంచి దాదాపు 40 జట్లు టోర్నీలో పాల్గొననున్నాయి. 700 మంది క్రీడాకారులు, 160 మంది అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు మొత్తం 860 మంది రానున్నారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్‌జీఎఫ్ తెలిపింది. జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియం మైదానం, ఎండీసీఏ మైదానం, పాలిటెక్నిక్ కళాశాల మైదానం, ఎంవీఎస్ కళాశాల మైదానం, ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న టర్ఫ్ వికెట్ మైదానంలో పోటీలు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం: డీవైఎస్‌వో

ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయ స్థాయి బాలుర క్రికెట్ టోర్నీ నిర్వహణను మహబూబ్‌నగర్ కేటాయిస్తూ ఎస్‌జీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు నగరంలో ఉన్న స్టేడియం మైదానంలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జనవరిలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించాము. అందరి సహకారంతో జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

గద్వాలలో రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ టోర్నీ

రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ టోర్నీ నిర్వహణ కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కేటాయించింది. గద్వాలలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు ఉండటంతో ఏప్రిల్ మొదటి వారంలో టోర్నీ నిర్వహించే అవకాశం ఉంది. ఈ టోర్నీలో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు పాల్గొననున్నాయి. 200 మంది క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు, 50 మంది అఫీషియల్స్ పాల్గొనున్నారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు.

తిమ్మారెడ్డిపల్లిలో బావోజీ దేవాలయాన్ని పరిశీలిస్తున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు →



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్
- తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన బావోజీ ఉత్సవాలపై అధికారులు, ఆలయ కమిటీతో సమావేశం

కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గురులోకమాసంద్ ప్రభువు (బావోజీ) బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం ఆ ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 11 నుంచి 14 వరకు జరిగే బావోజీ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. రథం వెళ్లే దారిలో విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆలయంతో పాటు, ప్రాంగణాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించాలని తెలిపారు. విద్యుత్ శాఖ పరంగా 20 స్తంభాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. తహసీల్దార్ సమన్వయం చేసుకొని పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. నారాయణపేట, కోస్గి, తాండూర్, మహబూబ్‌నగర్ డిపోల నుంచి బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. సమావేశానికి ముందు కలెక్టర్, కాడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, గురులోకమాసంద్ ప్రభువును(బావోజీ) అమ్మవారిని, కాళికాదేవిని ఆలయంలో దర్శించుకున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు వినికిడి క్యాంప్



మహబూబ్‌నగర్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న జనరల్ ఆస్పత్రి వైద్యుడు

మహబూబ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ట్రాఫిక్ పోలీసులకు పోలీస్ స్టేషన్‌లో హియరింగ్ పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఆసుపత్రి వైద్యులు 40 మంది పోలీసులు పరీక్షలు నిర్వహించి, ముగ్గురికి వైద్యం నిమిత్తం జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అసోసియేటెడ్ ప్రొఫెసర్ డా.మహేశ్వర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి, ఎస్ఐ గోపాల్‌నాయక్, ఆడియాలజిస్ట్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

ఏ క్షణంలోనైనా..



రెస్క్యూ బృందాలతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



టన్నెల్ వద్ద చేపట్టిన శాంతి పూజలు

(5వ పేజీ తరువాయి)

అధికారులు భావించగా.. ఇప్పటికే వారి ప్రాణాలపై ఆశలు సన్నగిల్లాయి. ఈ నేపథ్యంలో టన్నెల్ వద్ద పరిస్థితిని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి త్వరితగతిన కన్వేయర్ బెల్టుకు మరమ్మతులు చేసి.. మట్టిని తరలిస్తేనే కార్మికుల ఆచూకీ కనిపెట్టడం సాధ్యమవుతుందని రెస్క్యూ బృందాలకు సూచించారు. దీంతో దాని మరమ్మతు పనులు చేపట్టి.. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కన్వేయర్ బెల్టును ప్రారంభించారు. ప్రమాదం జరిగేటప్పటికి బెల్టుపై ఉన్న మట్టి తొలగింపు పూర్తికాగా, ఇప్పుడు బురద మట్టిని తొలగించే పనులు ప్రారంభించారు.

గంటకు 800 టన్నులు బయటకు..

లోకో ట్రెయిన్ ద్వారా కంటెయినర్లలో 10 టన్నుల బురద మట్టి కూడా బయటకు రావడం లేదు. దానికి ట్రెయిన్ లోపలకు వెళ్లడానికి, బయటకు రావడానికి దాదాపు 2 గంటలపైనే సమయం పడుతోంది. కాబట్టి దాంతో మట్టి తరలింపు చాలా కష్టమైన ప్రక్రియ. ఇప్పుడు కన్వేయర్ బెల్టు సిద్ధం కావడంతో గంటకు 800 టన్నుల చొప్పున బురద మట్టి బయటకు వస్తోంది. లోపల దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉన్నట్లు తెలుస్తుండగా.. ముందుగా జీపీఆర్ ఆధారంగా ఇచ్చిన ఫైండింగ్స్ ఉన్న ప్రాంతాల్లోని మట్టిని తరలించాలని భావిస్తున్నారు. ఇన్నాళ్లు అక్కడ మట్టి తవ్వుతున్నా.. పక్కనే వేయడం, ఉబికి వస్తున్న ఊటతో మళ్లీ మట్టి చేరుకోవడంతో సింగరేణి కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఎప్పటిమట్టిని అప్పుడు కన్వేయర్ బెల్టు మీద వేసే అవకాశం ఉండటంతో వేగంగా తరలింపు ప్రక్రియ జరగనుంది. అలాగే సహాయక చర్యలు కూడా కొలిక్కి రానున్నాయి. టన్నెల్‌లో సహాయక బృందాలు నాలుగు షిఫ్టులుగా 24 గంటలు పని చేస్తున్నాయి. ఒక్కో షిఫ్టులో 60 మంది వరకు పని చేస్తున్నారు. సింగరేణి సిబ్బంది మట్టి తొలగింపులో నిమగ్నం కాగా.. దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది ప్లాస్మా కట్టర్లు, టీబీఎం మిషన్ కట్ చేస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వారికి మద్దతుగా ఉండటంతోపాటు, మిగతా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మట్టి తరలింపునకు కన్వేయర్ బెల్టు సిద్ధం కావడంతో లోకో ట్రెయిన్ ద్వారా టీబీఎం నుంచి కట్ చేసిన వ్యర్థాలను తరలించనున్నారు. రెస్క్యూ పనులను నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ కూడా పర్యవేక్షిస్తున్నారు. టన్నెల్ వద్ద మంగవారం శాంతి పూజలు చేశారు.

ఆ అయిదుచోట్లే కీలకం..

టన్నెల్‌లో ప్రమాదం రెండుసార్లు జరగ్గా.. దాదాపు 18 నుంచి 24 ఫీట్ల మేర కొన్నిచోట్ల బురద పేరుకుపోయింది. అందుకే అందులో ఇరుక్కుపోయిన కార్మికుల ఆచూకీ కనిపెట్టడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఎన్‌జీఆర్ఐ ఆధ్వర్యంలో గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ల(జీపీఆర్) ద్వారా కార్మికులు ఉండొచ్చనే అంచనా ప్రాంతాలను గుర్తించారు. దాదాపు నాలుగు రోజుల నుంచి ఆ ప్రాంతాల్లోనే తవ్వకాలు జరుగుతున్నాయి. కార్మికులు మాన్యువల్‌గా తవ్వుతుండటంతో వేగంగా జరగడం లేదు. తవ్వినా మట్టిని తరలించే వెసులుబాటు లేకపోవడం కూడా మరో కారణం. ఇప్పుడు మట్టి తరలింపు వేగం కావడంతో ఏక్షణంలోనైనా కార్మికులను వెలికితీసే అవకాశం ఉంది. బుధవారం కచ్చితంగా కొందరి ఆచూకీ బయటపడుతుందని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే టన్నెల్ క్యాంపు వద్ద అంబులెన్స్‌లు, పార్థీవ వాహనాలు సిద్ధంగా ఉంచగా.. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యులు కూడా ఉన్నారు. వీరితోపాటు ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులను కూడా పిలిపించారు. ఒకవేళ కార్మికులు చనిపోయి ఉంటే.. ఇప్పటికే డీ కంపోజ్ అయి గుర్తు పట్టలేని విధంగా ఉన్న పక్షంలో డీఎన్ఏ పరీక్షల కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. అలాగే మట్టి తవ్వుతున్నా కొద్ది మరేదైనా ప్రమాదం జరగకుండా పరిస్థితిని సమీక్షించేందుకు ఢిల్లీ నుంచి నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ బృందం కూడా టన్నెల్‌కు చేరుకుంది.

పనులు నిలిపి వేయడమే ప్రమాదానికి కారణమా?

- శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో పనులు ముందుకు సాగేనా?
- భయంతో సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ బృందాలు

దోమలపెంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగపు పనులు ముందుకు సాగకుండా 2019లో 13.9 కిలోమీటర్ల దగ్గర నిమిషానికి 9వేల లీటర్ల నీటి ఊట వచ్చింది. దీంతో అప్పట్లో ఆ నీటిని బయటకు తోడేందుకు జేపీ కంపెనీ యాజమాన్యం మోటారు పంపులను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఎటువంటి పనులు ముందుకు సాగలేదు. ఐదేళ్ల పాటు డీ వాటరింగ్ చేస్తున్నా.. క్రమక్రమంగా కొంత కాలానికి సొరంగంలో నీటి ఊటను నిలువరించేందుకు సాంకేతికంగా సిమెంట్ గ్రౌటింగ్, కెమికల్ గ్రౌటింగ్ చేసి 9వేల లీటర్ల నీటి ఊటను 5 వేల వరకు నిలువరించగలిగారు. ఐదేళ్ల పాటు పనులు నిలిచి పోవడంతో నిలువరించిన నీరంతం గ్రౌటింగ్ చేసిన ప్రాంతంలో కొండ పొరలలో చేరుకొని ఇటీవలన టీబీఎం మిషన్ పనులు ప్రాంభం అయన కొద్ది రోజులకే మట్టి దిబ్బలు, కొండరాళ్లు కూలీ పడటంతో సొరంగంలో శిథిలాల కింద చిక్కి పోయారు.

సొరంగ ప్రమాదంలో శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు దేశంలో ఉన్న 12 రెస్క్యూ బృందాలు పాల్గొన్నాయి. కాని సొరంగంలో పేరుక పోయిన మట్టి, బురద, రాళ్లను బయటకు తరలించేందుకు సహాయక చర్యలలో పాల్గొనే బృందాల సభ్యులు కొంత భయంతో ఉన్నారు. టీబీఎం మిషన్ డ్రిల్లింగ్ సమయంలో సొరంగంలో ఒక్క సారిగా శిథిలాలు కూలి పడటంతో పాటు, వేగంగా నీటి ఊట రావడంతో ఆధాటికి పటిష్టంగా ఉన్న టీబీఎం మిషన్ పూర్తిగా ధ్వంసం అయ్యి రెండు భాగాలుగా విడిపోయింది. ఈ ప్రమాద ఘటన స్థలం నుంచి సూమారు వందల మీటర్ల వరకు ముందుకు జరిగి రావడంతో పాటు 10 మీటర్ల ఎత్తు ఉన్న సొరంగం పూర్తిగ శిథిలలాతో నిండి పోయింది. ప్రస్తుతం మట్టిలో టీబీఎం మిషన్‌కు అనుసంధానంగా ఉండే సిస్టం క్యాబిన్ కూడా పూర్తిగా శిథిలాల కింద కూరుకు పోయింది. టీబీఎం మిషన్‌ను తీసేందుకు సహాయ చర్యలో పాల్గొనే బృందాల సభ్యులు జంకుతున్నారు.



సొరంగంలో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్న ప్రాంతం

మరికొంత సమయం..

శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి బయటకు తీసుకు రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉండొచ్చని రెస్క్యూ బృందం నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుం జీపీఆర్ సర్వే స్కానింగ్‌తో ఐదు ప్రాంతాలను గుర్తించారు. అక్కడ 10 అడుగుల మేర బురద, మట్టి పేరుకుపోయింది. తవ్వేందుకు కష్టంగా ఉందని సహాయక చర్యల్లో పాల్గొనే కార్మికులు అంటున్నారు. బురద, రాళ్లు, మట్టిని బయటకు తరలించేందుకు కన్వేయర్ బెల్ట్‌పైన వ్యర్థాలను వేయడానికి మనుషులకు తప్ప యంత్రాలు వేసే అవకాశం లేనందున సహాయక చర్యలు మరికొంత ఆలస్యం కావచ్చునని నిపుణుల ద్వారా తెలుస్తోంది.

ఘనంగా కట్టమీది ఎల్లమ్మ జాతర ఉత్సవాలు



లింగంపల్లిలో బోనాలతో మహిళలు

దామరగిద్ద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కట్టమీది ఎల్లమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం జల్దిబిందె ఊరేగింపులో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఎల్లమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సనాతన ధర్మ ప్రచారకర్త కొత్తకోట శివానందస్వామి పాల్గొని మాట్లాడారు. ఆలయ కమిటీ నాయకులు ఉలిగుండం లక్ష్మయ్య, శాసన్‌పల్లి చిన్నయ్య, గంగాపూరి తాయప్ప, ఎం.నారాయణ, చావలి కిష్టప్ప, మాజీ సర్పంచు వన్నాడ ఆశమ్మ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పుట్ట ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, లక్ష్మణ్, ఖాజమియా తదితరులున్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



లింగంపల్లి ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

నారాయణపేట రూరల్ : పేట మండలంలోని లింగంపల్లి ఎల్లమ్మ జాతరకు నాలుగో వారమైన మంగళవారం భక్తులు పోటెత్తారు. మహిళలు బోనాలతో అమ్మవారికి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు పరిసర ప్రాంతాల్లోని భక్తులు తరలి రావడంతో లింగంపల్లి జనసంద్రమైంది.

ఏ జిల్లా కళాశాల ఇది..

- నారాయణపేట జిల్లా ఏర్పాటై ఐదేళ్లు..
- కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల బోర్డుపై నేటికీ మహబూబ్‌నగర్ పేరు

కోస్గి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా పేరు మార్చలేదు. కళాశాల ప్రిన్సిపాల్ గానీ, సిబ్బంది కానీ తమకేమీ పట్టనట్లు, తమను ఎవరూ అడగరని అనుకున్నారో ఏమో కానీ కళాశాల బోర్డులో ఇంకా మహబూబ్‌నగర్ జిల్లా అని ఉంది. ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కళాశాలలో ఇలాంటి తప్పులు చేస్తే ఎలా అని పలువురు చర్చించుకుంటున్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈ కళాశాలను సెంటర్‌గా ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోస్గి నారాయణపేట జిల్లా అని ఉంది కానీ కళాశాల బోర్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోస్గి మహబూబ్‌నగర్ జిల్లా అని ఉంది. ఇది ఏ జిల్లా పరిధి కళాశాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా జిల్లా పేరు మార్చండి సారూ అని పలువురు కళాశాల అధ్యాపకులను కోరుతున్నారు.



కోస్గి జూనియర్ కళాశాల బోర్డుపై ఉన్న మహహబూబ్‌నగర్ జిల్లా పేరు

లైంగిక వ్యాధులపై అవగాహన




ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్య, కళాశాల సిబ్బంది

కొల్లాపూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మహబూబ్‌నగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఎయిడ్స్ కంట్రోలింగ్ అధికారి డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ నేడు సమాజంలో ఆరోగ్యపరమైన సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా యూత్ కోఆర్డినేటర్ కోటా నాయక్ మాట్లాడుతూ యువత ముఖ్యంగా ఈ వ్యాధి బారిన పడుతున్నారని, ఎయిడ్స్ అనేది భయపడాల్సిన వ్యాధి కాదని, అర్థం చేసుకోవాల్సిన వ్యాధి అని, సమాజంలో అపోహలను పోగొట్టేలా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్‌పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, కొల్లాపూర్ రిసోర్స్‌పర్సన్ సురేందర్, నెహ్రూ యువకేంద్రం ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ రాజేందర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌కుమార్, కుర్మయ్య, సోఫీ పాషా, బాలరాజు, శివుడు, మహదేవుడు, కేశవులు, బాలు, విష్ణు, అనిత, మౌకిన, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమగ్ర అభివృద్ధి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని

వనపర్తి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రజిని అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని ఎస్వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను చట్టాలను వినియోగించుకుని మహిళలు అన్ని రంగాల్లో అత్యున్నతమైన స్థానంలో ఉండాలని కోరారు. బాల్య వివాహాలు చేసి, మహిళల అభివృద్ధికి భంగం కలిగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలకు మహిళలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని తెలిపారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది చాంద్ పాషా, కల్పన పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగునీటిపై ఆశలు

గద్వాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని 99, 100వ ప్యాకేజీ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎట్టి పరిస్థితిలో వానకాలం సాగునీరు అందించాలనే లక్ష్యంతో అధికారులు కాంట్రాక్టర్ల వెంట ఉండి పనులు చేయిస్తున్నారు. మూడు నెలల క్రితం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా 100వ కాలువతో పాటు 99వ ప్యాకేజీ వద్ద జరుగుతున్న అక్విడెక్ట్ పనులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వానకాలం రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది. నెట్టెంపాడు ప్రాజెక్టులో లిఫ్ట్-1 కింద గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కిందనే 99, 100వ ప్యాకేజీ కాలువ ఉంది. దీని పరిధిలోని 63వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నెట్టెంపాడు లిఫ్ట్ ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆరువేల ఎరాలకు మాత్రమే సాగునీరు అందించారు. మిగిలిన ఆయకట్టు పదేళ్లుగా సాగునీటికి నోచుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనులు పూర్తి చేసి వానకాలం నాటికి రైతులకు సాగునీరందించాలనే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచింది.



కొండపల్లి వద్ద పెండింగ్‌లో ఉన్న అక్విడెక్ట్ పనులు

99, 100వ ప్యాకేజీ కాలువ పరిధి..

నెట్టెంపాడు ప్రాజెక్టు ప్రాజెక్టు లిఫ్ట్-1 కింద ధరూర్ మండలంలో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నిర్మించారు. దీని సామర్థ్యం 1.19 టీఎంసీలు. 63 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందించడానికి కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. ఎడమ కాలువ కింద ఆరువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాని కుడి కాలువ పరిస్థితే నత్తకు నడకనేర్పేవిధంగా మారింది. కుడి కాలువ పనులను 99వ ప్యాకేజీ, 100ప్యాకేజీలుగా విభజించారు. ధరూర్, గద్వాల, ఇటిక్యాల మండలాల పరిధిలో 76 కిలో మీటర్ల పొడవున వీటిని నిర్మించాలి. ఇటిక్యాల మండల పరిధిలో 100వ ప్యాకేజీ పనులు దాదాపుగా 40 కిలో మీటర్ల పొడవున పూర్తయ్యాయి. 0-36 కిలోమీటరు పరిధిలోని 99వ ప్యాకేజీలో కొండపల్లి వద్ద అక్విడెక్ట్ పనులు ఆలస్యమవుతున్నాయి. కాంట్రాక్టర్ మార్పుతో ఆ పనులు నెల రోజుల్లో పూర్తి అయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా 250మీటర్ల మేర కాలువ నిర్మాణంతో పాటు అక్కడక్కడ మిగిలిపోయిన పనులను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులను మే చివరి నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు, అధికారులు అంటున్నారు.

సాగునీరు వస్తే బంగారు పంటలే..

99, 100వ ప్యాకేజీ పనులు పూర్తయి సాగునీరు వస్తే బంగారు పంటలు పండే అవకాశం ఉంది. గద్వాల మండలం కొండపల్లి నుంచి ఇటిక్యాల మండలంలోని నేలలు అన్ని పంటలకు అనుకూలిస్తాయి. ఇప్పటికే వర్షాధార పంటలను పండిస్తున్నారు. కాలువల ద్వారా సాగునీరు వస్తే పత్తి, మిరప, పొగాకు, మొక్కజొన్న వంటి పంటలు సాగుచేసుకునే అవకాశం ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వానకాలం పంటలకు సాగునీరు అందిస్తాం



ప్రధాన కాంట్రాక్టర్ల స్థానంలో కొత్తవారికి కాంట్రాక్ట్ పనులు ఇచ్చాం. 99వ ప్యాకేజీలో అక్విడెక్ట్ చివరి దశలో ఉంది. మరో రెండు నెలలో పూర్తి చేస్తాం. అదేవిధంగా కొద్దిమేర కాలువ నిర్మాణం పనులు ఉన్నాయి. వానకాలం పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం.

- రహిముద్దీన్, ఎస్ఈ, గద్వాల

బీసీల చైతన్యంతోనే బహుజనులకు రాజ్యాధికారం

- బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వట్టి జానయ్య యాదవ్

బిజినేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీసీల చైతన్యంతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ నాయకుడు వట్టి జానయ్య యాదవ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని ఎంజేఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన బీసీ చైతన్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో దశాబ్దాలుగా బీసీ వాదంతో ఎంతో మంది పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ మధ్యకాలంలో బీసీవాదం బలంగా వినిపిస్తున్న తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేసి వారి ఉద్దేశ్యాన్ని చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేశారు. బీసీలు సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే బీసీ వాదంతో ఏకమై మనకు మనమే రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. జనాభాలో తక్కువ శాతం ఉన్న అగ్రవర్ణ నాయకులను రిజర్వేషన్లు ఇవ్వమని అడగడం కాదని, రాజ్యాధికారం చేపట్టి చట్టసభల్లో చట్టాలు చేసి వారి జనాభాకు సరిపడా రిజర్వేషన్లు మనం చేయాల్సిన రోజు రావాలని అన్నారు. ఈ సందర్భంగా బిజినేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బీసీ కమిటీలు వేసి బీసీల్లో చైతన్యం నింపిన దాసరి వెంకటస్వామి, అంతటి రాజేందర్‌గౌడ్, ఊర్కొండ రఘుబాబు, సత్యశీలసాగర్, భగవంత్ గౌడ్ తుమ్మల అల్లోజీ, రామన్‌గౌడ్, చిన్నయ్యసాగర్, దేశెట్టి రాజేష్ సాగర్‌లను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం నాయకులు సూర్యరావు, విజయ్ కుమార్, శ్రీనివాస్ సాగర్, గంగాధర్, మాజీ సర్పంచులు అవంతి శంకర్, అశోక్, అతినారపు బాలలక్ష్మయ్య తదితరులు ఉన్నారు.



బిజినేపల్లి బీసీ సదస్సులో అభివాదం చేస్తున్న రాష్ట్ర బీసీ నాయకులు

సౌత్‌జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో నల్లమల విద్యార్థుల ప్రతిభ

అచ్చంపేటటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ జిల్లాలో సౌత్‌జోన్ షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. వీరిలో జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి శ్రీవల్లి, బాలుర విభాగంలో అఖిలేష్, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ బహుమతి రేఖ, బాలుర విభాగంలో ప్రథమ బహుమతి సిద్ధు బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఈటీ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలి

- టీజీ ఎస్‌సీడీసీఎల్ సీఈ శివాజీ



రైతులతో మాట్లాడుతున్న టీజీ ఎస్‌సీడీసీఎల్ సీఈ శివాజీ

వంగూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీజీఎస్‌సీడీసీఎల్ సీఈ శివాజీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిని సీఈ సందర్శించారు. రైతు వేదిక సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం అయ్యారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నాయ, సమస్య వస్తే ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందించాలని అన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న సోలార్ పనులను పర్యవేక్షించారు. గ్రామస్థులతో సమావేశమైన అధికారులు గ్రామస్థులను సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. విద్యుత్ సమస్య తలెత్తుతే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఈసీ పాల్‌రాజ్, డీఈ రవికుమార్, ఎస్ఏ పార్థసారథి, ఏడీ, ఏఈ పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

బిజినేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యాసంగి మొక్కజొన్న సాగులో మోతాదుకు మించి ఎరువుల వినియోగం పంటకు నష్టం కల్గిస్తుందని కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్‌లో మంగళవారం మొక్కజొన్న, మినుము, టమాట, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచన లు, సలహాలు ఇచ్చారు. మొక్కజొన్న పంటకు 60 రోజుల తర్వాత రసాయన ఎరువులు వేయరాదని సూచించారు. వరి పంటకు ఆశించిన ఆకు ఎండు తెగులు నివారణకు ఎకరాకు 40గ్రాముల ప్లాంటమైసిన్ పిచికారి చేసుకోవా లని తెలిపారు. అగ్గి తెగులు నివారణకు ఎకరాకు 80 గ్రాముల ట్రైఫ్లాక్సీ స్ట్రోబిన్, టెబుకొనజోల్‌ను, టమాట పంటలో ఆకు మచ్చ తెగులు నివారణకు పైరాక్సీస్ట్రోబిన్ 250 మిల్లీ లీటర్లు చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. క్షేత్ర పర్యటనలో ఆయన వెంట కేవీకే విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, రైతులు పరశురాములు, కొండన్న, నరేష్ ఉన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

ఖిల్లాఘణపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో తీవ్ర మనోవేదనకు గురై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని ఈర్లతండాలో చోటు చేసుకుంది. ఈర్లతండాకు చెందిన పాత్లావత్ హరిచంద్ (46) కుటుంబ విషయంలో సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. హరిచంద్ తీవ్ర మనోవేదనకు గురై రాత్రి తాడుతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య పాత్లావత్ వాలీబాయి మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ బద్రు నాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

భర్త హత్య కేసులో భార్య, కుమారుడి రిమాండ్

హన్వాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భర్తను హత్య చేసిన భార్య, కుమారుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్ చెందిన శ్రీనివాస్‌గౌడ్(47)ను భార్య లక్ష్మి, కుమారుడు రామకృష్ణ కలిసి ఆదివారం రాత్రి గొంతు నుమిలి హత్య చేసిన విషయం తెలిసిందే. రూరల్ సీఐ, ఎస్ వెంకటేష్ మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

- ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు తెలిపిన భర్త



మహేశ్‌తో పోలీస్ సిబ్బంది

జడ్చర్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చల్లపల్లికి చెందిన మహేశ్, భార్య బాలమ్మ అలియాస్ హరితతో గొడవపడ్డాడు. కాగా ఆమె కొద్దిరోజులు హైదరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన మహేశ్ సోమవారం ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ ద్వారా భార్యకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె మహేష్ చెల్లెలు జ్యోతికి సమాచారం ఇచ్చింది. జ్యోతి వెంటనే 100కు ఫోన్ చేసి వివరాలు తెలిపింది. దీంతో కానిస్టేబుల్ సత్యపాల్, హెడ్ కానిస్టేబుల్ జనార్దన్, మహేష్ ఫోన్ లోకేషన్ కనుగొన్నారు. చర్లపల్లి శివారులోని సొంత పొలంలో బీరు సీసా, పురుగు మందుతో ఉన్న మహేష్‌ను పట్టుకున్నారు. అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అడవి జంతువు దాడిలో బర్రెదూడ మృతి

తిమ్మాజిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని చేగుంటలో రైతు వెంకటయ్యకు చెందిన బర్రె దూడ అడవి జంతువు దాడిలో మృతి చెందింది. సోమవారం రాత్రి రైతు తన పొలంలోని కొట్టంలో బర్రెలను కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం పొద్దున్నే వెళ్లి చూడగా బర్రె దూడ మృత్యువాత పడింది. పరిశీలించిన పలువురు హైనా దాడి చేసిందని, కొన్నాళ్లుగా అడవి జంతువుల దాడుల్లో పశువులు మృతి చెందుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించాలని, పశువులకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

మరికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని హరిజన్ కిష్టన్న వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు తగిలి షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం ఎద్దు మేత మేస్తుండగా ఈ ఘటన జరిగిందని, ఎద్దు విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోస్గి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున నారాయణపేట జిల్లా కోస్గి మండ లంలోని ముశ్రీఫా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తు న్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు ట్రాక్టర్లను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చే స్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

బాలానగర్: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని మాచారం వాగు నుంచి సూరారం చెందిన ట్రాక్టర్ ఇసుక లోడుతో బాలానగర్ వైపు వెళ్తుంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌లు దేవేందర్‌రెడ్డి, బాల్‌రాజ్ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో సూరారం చెందిన మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

అలంపూరు చౌరస్తా, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదైంది. ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.1.20లక్షల నగదు, 20 తులాల వెండి మాయం

పాన్‌గల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లాలోని పాన్‌గల్ మండలంలోని మాందాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు బెంగిని ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తనకున్న గొర్రెలను మేత మేపడం కోసం పొలాలకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం భార్య వెంకటమ్మ ఇంటికి వెళ్లగా తాళాలు పగలగొట్టి బీరువాలోని రూ.1.20లక్షల నగదు, 20 తులాల వెండి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బంగారాన్ని అందించిన పోలీసులు

రేవల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని శానాయపల్లి గట్టుపై వెలిసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవానికి వచ్చి గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన మమత రెండు తులాల నాను బంగారాన్ని ఫిబ్రవరి 28న పోగొట్టుకుంది. బంగారం రేవల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ శివకుమార్ బందోబస్తులో గుడి వద్దకు వెళ్లగా దొరికింది. అతను వెంటనే ఎస్ఐ రాముకు అప్పచెప్పారు. బాధితురాలు గుడి నిర్వాహకుడు లింగస్వామికి సమాచారం ఇచ్చింది. దీంతో లింగస్వామి మండల పోలీసులకు తెలిపాడు. ఎస్ఐ వారిని స్టేషన్ వద్దకు పిలిచి సంబంధిత పత్రాలు పరిశీలించి వారికి మంగళవారం బంగారాన్ని అందజేశారు. కానిస్టేబుల్ శివశంకర్‌ను ఎస్ఐ అభినందించారు.

కండక్టర్ వైర్ కోసం నిరీక్షణ

- డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా సప్లయి చేయని అధికారులు
- ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు వేసే వరకే పరిమితం
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రైతులు
- పంటలెండుతుండటంతో బోర్లు వేస్తున్న అన్నదాత

మహబూబ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో విద్యుత్‌శాఖ కండక్టర్ వైర్ సప్లయి లేదని చెబుతుండటంతో డీడీలు కట్టిన రైతులు అధికారులు, కాంట్రాక్టర్‌ల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. రైతు బోరు వేసిన వెంటనే పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఉంటే అక్కడి నుంచి తన బోరు వరకు కావల్సిన స్తంభాలు, కండక్టర్ వైర్‌కోసం డీడీ చెల్లిస్తాడు. డీడీ చెల్లించిన వారికి క్రమపద్ధతిలో విద్యుత్‌శాఖ అధికారులు మెటీరియల్ సరఫరా చేస్తారు. ఇక్కడ కూడా డబ్బులిచ్చి పైరవీలు చేసుకున్న వారికి సీనియారిటీని పక్కన పెట్టి మెటీరియల్ సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

డిస్కంల నుంచే సప్లయి లేదని అధికారులు చెబుతుండగా వైర్ కోసం ఎదురు చూసి పంటలెండిపోతున్న పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్‌లో చేస్తున్నారు. కర్రల సాయంతో వైర్‌లాగి బోర్‌కు కనెక్షన్ ఇచ్చి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో రైతులు డీడీలు చెల్లించి ఎదురుచూస్తున్నారు.



హన్వాడ మండలం నాయినోనిపల్లిలో స్తంభం పాతి కండక్టరు వైరు బిగించని దృశ్యం

సప్లయి లేదు

కొద్ది రోజులుగా కండక్టర్ వైరు సప్లయి లేదు. గత నెలలో వస్తే రైతులకు ఇచ్చాం. ఈసారి కొంత ఆలస్యమైంది. ఇక్కడే కాదు ఎక్కడా సప్లయి లేదు. త్వరలోనే వస్తుంది. రాగానే ఆర్డర్ ప్రకారంలో రైతులకు సరఫరా చేస్తాం.

\- వెంకటరమణ, విద్యుత్ ఎస్ఈ

ముదురుతున్న ఎండలతో అధికంగా బోర్లు

మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగిలో పెద్దఎత్తున వరిసాగు చేశారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయి. ఎకరా పంటకు నీళ్లు సరిపోతాయని అంచనా వేసి వరినాటు వేయగా, నీరు తగ్గడంతో అరెకర పొలం పారడం గగనమైంది. పంట ఎండటాన్ని చూసి తట్టుకోలేని అన్నదాతలు కొత్తబోర్లు వేస్తున్నారు. అయినా పంట ఎండిపోకుండా కాపాడుకుందామంటే కండక్టర్ వైర్ లేకపోవడంతో ప్రైవేట్‌లో వైర్ కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్‌కు తగ్గ సప్లయి లేకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. అత్యవసరం ఉన్నవారికి ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ప్రస్తుతం పంటలేసుకుని డీడీలు కట్టిన వారందరికీ అత్యవసరమేనన్న విషయాన్ని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది.



“ఈయన హన్వాడ మండలం నాయినోనిపల్లికి చెందిన రైతు నర్సింహులు. ఏడాది క్రితం తన బోరు కోసం మూడు స్తంభాలు, కండక్టర్ వైర్ కావాలని డీడీ చెల్లించాడు. మూడు నెలల క్రితం స్తంభాలు పాతారు. కండక్టర్ వైర్ లాగాలని అధికారులు, కాంట్రాక్టర్ చుట్టూ తిరుగుతున్నా సప్లయి లేదని చెబుతున్నారు. పంటెండిపోతుందని భావించిన ఆయన ప్రైవేట్‌లో వైర్ కొనుగోలుచేసి కర్రలను స్తంభాలుగా ఏర్పాటు చేసుకొని తాత్కాలికంగా బోరుకు కనెక్షన్ ఇచ్చి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు.”

“మిడ్జిల్ మండలంలో 30 మంది వరకు రైతులు స్తంభాలు, కండక్టర్ వైర్ కోసం డీడీలు తీశారు. ఇందులో చాలా మందికి స్తంభాలు బిగించినా కండక్టర్ వైర్ సప్లయి చేయలేదు. స్తంభాలు వచ్చి 60 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు వైర్ రాకపోవడంతో కొందరు ప్రైవేట్‌ను ఆశ్రయించగా, మరికొందరు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారం, పది రోజుల్లో వస్తుందని అధికారులు రైతులకు సర్దిచెబుతూ వస్తున్నారు.”

చెత్త సేకరణ విధానంపై శిక్షణ

- ఉమ్మడి జిల్లా మునిసిపల్ అధికారులు, సిబ్బంది హాజరు



విండ్రో కంపోస్ట్ గురించి వివరిస్తున్న కార్మికులు

మహబూబ్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : చెత్త సేకరణ విధానం, తడిపొడి చెత్త సేకరణ, కంపోస్ట్ అంశాలపై అవగాహన కల్పించేందుకు పాలమూరు కార్పొరేషన్‌లో ఉమ్మడి జిల్లాలోని మునిసిపల్ అధికారులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మొదటిరోజు మంగళవారం మహబూబ్‌నగర్ డంపింగ్‌యార్డ్‌లో సీడీఎంఏ నుంచి వచ్చిన కంపోస్ట్ డెవలప్‌మెంట్ అధికారి హేమలత ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కంపోస్ట్ ఎలా చేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. తడి,పొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారు? హోటళ్లు, వ్యాపార సముదాయాల నుంచి సేకరించిన చెత్తను డీఆర్‌సీ కేంద్రాలకు తరలించడం వంటి అంశాలపై వివరించారు. ఒక వార్డును ఎంచుకుని అక్కడ తడి, పొడి చెత్త సేకరణను వంద శాతం అమలు చేసి మరో వార్డుకు వెళ్లడం వంటి పద్ధతులపై అవగాహన కల్పించారు. విండ్రో కంపోస్ట్ పద్ధతులను తెలిపారు. పాడైన కూరగాయలు, పేడ, ఎండు ఆకులను పొరలుగా అమర్చుకుంటూ విండ్రో కంపోస్ట్ తయారు చేయాలని తెలిపారు. అదేవిధంగా డీ కంపోజ్ విధానంపై అవగాహన కల్పించారు. అన్ని మునిసిపాలిటీలలో ఈ పద్ధతులను పాటించాలని సూచించారు.

కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అచ్చంపేట, అమరచింత, వడ్డేపల్లి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, భూత్పూర్, అయిజ, గద్వాల మునిసిపాలిటీలకు చెందిన కమిషనర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జవాన్లు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం నరబలి అవాస్తవం

- తవ్వకాలు చేసిన వారిపై కేసు నమోదు
- నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్

నాగర్‌కర్నూల్ క్రైం/ బిజినేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : గుప్త నిధులు తవ్విన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బిజినేపల్లి మండలం వట్టెంతండాకు చెందిన రమావత్ జైపాల్, తిరుపతి ఇటీవల వట్టెం శివారులోని తమ వ్యవసాయ పొలంలో పుట్టగడ్డ వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తుండగా తండావాసులు పట్టుకుని చితకబాదారు. ఈ ఘటనపై పలు పుకార్లు వెలుగులోకి వచ్చింది. బాలికను నరబలి ఇస్తున్నారని వచ్చిన పుకార్లపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. తవ్వకాలు చేపట్టిన మాట వాస్తవమేనని చెప్పారు. కాగా తన వ్యవసాయ పొలం వద్ద బోరుబావి వేసేందుకు ఓ వ్యక్తిని పాయింట్ చూపించడానికి తీసుకెళ్తే, అతను పుట్టగడ్డ వద్ద బంగారం ఉందని చెప్పడంతో వరుసకు తమ్ముడైన తిరుపతిని పిలిపించి తవ్వుతుండగా గ్రామస్థులు దాడి చేశారని విచారణలో రమావత్ జైపాల్ తెలిపినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. తమకు ఎలాంటి నరబలి ఇవ్వాల్సిన అవసరం లేదని వారు విచారణలో పేర్కొన్నారని డీఎస్పీ చెప్పారు. బాలికను కూడా విచారించామని, తాను బంధువుల వద్దకు వచ్చిందని పేర్కొన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఏళ్ల తరబడి ఖాళీగా..

- ఇటీవల మంత్రి ప్రకటనతో అంగన్‌వాడీ, ఆయా పోస్టులపై చిగురిస్తున్న ఆశలు
- గద్వాల జిల్లాలో 62 టీచర్, 173 హెల్పర్ పోస్టులు ఖాళీ



గద్వాలలోని వేణుకాలనీలో టీచర్, హెల్పర్ లేక మూతబడిన అంగన్‌వాడీ కేంద్రం (ఫైల్)

గద్వాల న్యూటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వచ్చేలా ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క రాష్ట్రంలో ఉన్న ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలపడంతో జిల్లా సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఇటీవలే ఖాళీలపై నివేదిక తయారు చేశారు. జిల్లాలో టీచర్లు, ఆయాల కొరత ఉండటంతో ఇతర సెంటర్ల నుంచి వచ్చి కొన్ని కేంద్రాలలో పాలు, గుడ్లు పంపిణీ చేస్తున్నారు. సకాలంలో చిన్నారులకు పౌష్టికాహారం అందకపోవడంతో పెరుగుదల మందగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

జిల్లాలో 713 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 713 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గద్వాల అర్బన్ పరిధిలో 262, గద్వాలరూరల్ పరిధిలో 213, మానవపాడులో 238 కేంద్రాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో గర్భిణులు 5,785, బాలింతలు 3,389 మంది, 0-3 ఏళ్ల చిన్నారులు 28,104, 3-6 ఏళ్ల లోపు చిన్నారులు 23,844 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, గుడ్లు, ఆహారం పంపిణీ చేయాల్సి ఉంది. టీచర్లు, ఆయాల కొరతతో ఈ పంపిణీ సక్రమంగా చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

జిల్లా కేంద్రంలోనే అధికంగా ఖాళీ..

జిల్లాలో ఇప్పటి వరకు 62 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 173 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఎక్కువగానే ఖాళీగా ఉన్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోనే ఎక్కువగా ఖాళీగా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో హమాలీకాలనీ, పిల్లిగుండ్ల, వేణుకాలనీ, చింతలపేటలతో పాటు మరికొన్ని కాలనీలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని కాలనీలలో ఉన్న కేంద్రాలను ఇతర కాలనీలోకి రీలొకేట్ చేయడంతో ఆ కాలనీలలో అంగన్‌వాడీ టీచర్ల కొరతతో కేంద్రాలను ఎత్తివేసే పరిస్థితి నెలకొన్నది. పాత హౌసింగ్ బోర్డుకు చెందిన సెంటర్‌ను మూడో వార్డులో కొద్దిరోజులుగా ఉంచడం, అక్కడ ఉన్న టీచర్ రాజీనామా చేయడంతో అక్కడ తాత్కాలికంగా ఉన్న సెంటర్‌ను అధికారులు మూసి వేశారు.

జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీలో అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో దౌదర్‌పల్లి కాలనీకి చెందిన టీచర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుంది. అలాగే రెవెన్యూ కాలనీకి చెందిన కేంద్రంలో సుంకులమ్మమెట్టు టీచర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుంది. రామ్‌నగర్ కాలనీలో ఉన్న రెండు సెంటర్‌లలో ఉన్న ఒకే అంగన్‌వాడీ టీచర్ ఒక కేంద్రానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. జిల్లాలో 30 కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల కొరత ఉన్న విషయం వాస్తవమే. అయితే ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుకు సంబంధించిన జాబితా తయారు చేసి సమర్పించాం. ఖాళీల భర్తీ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే టీచర్లు, హెల్పర్ల సమస్య ఉన్నా కూడా కేంద్రాలలో చిన్నారులకు ఇన్‌చార్జిల ద్వారా పౌష్టికాహారాన్ని అందించేలా చూస్తున్నాం.

\- సునంద, జిల్లా సంక్షేమాధికారి, గద్వాల

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- ఆందోళనకు దిగిన విద్యార్థులు
- డీఈవో హామీతో ఆందోళన విరమణ



పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో గోవిందరాజులు, మధ్యాహ్న భోజన పర్యవేక్షకుడు యాదయ్య

నారాయణపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేస్తుంటే పురుగులు వచ్చాయి. సమాచారం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థులతో కలిసి ఆందోళనకు దిగారు. విద్యార్థులు మాట్లాడుతూ.. చాలా సందర్భాల్లో విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని వంట ఏజెన్సీకి అనేకసార్లు చెప్పామన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. విద్యార్థులు పురుగులు ఉన్నాయని చెబితే రోజూ వచ్చి బియ్యంలో పురుగులను ఏరి ఇవ్వండని విద్యార్థులకు వంట ఏజెన్సీ అనడం ఎంత వరకు సమంజసమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. వంద మంది విద్యార్థులు భోజనం చేయకుండా ఉండడంతో డీఈవో గోవిందరాజు, మధ్యాహ్న భోజన జిల్లా పర్యవేక్షకుడు యాదయ్య అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. వంట ఏజెన్సీ వర్కర్లకు రోజూ నాణ్యమైన భోజనం పెట్టాలని, మెనూ పాటించాలని సూచించారు. ఇకపై పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించి భోజనం చేశారు.

ఉయ్యాలవాడలో ఏటీఎం ధ్వంసం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో సోమవారం రాత్రి ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ ఘటనపై బ్యాంకు మేనేజర్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మిషన్ ధ్వంసమైనట్లు ఫిర్యాదులో తెలిపారు.

బాలుడిపై సవతి తల్లి దాష్టీకం

- వాతలు పెట్టి, కర్రతో కొట్టడంతో గాయాలు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాలుడి మేనమామ

పెబ్బేరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఓ సవతి తల్లి దాష్టికం సభ్య సమాజం తలదించుకునేలా చేసింది. అభంశుభం తెలియని చిన్నారిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయాలపాలు చేసింది. వివరాల్లో వెళితే వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సుగూరులో గొల్ల నర్సింహ కొత్తకోట మండలం మిరాశిపల్లికి చెందిన రేణుకను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. రేణుక 2019లో పాముకాటుతో మృతి చెందింది. పిల్లలకు తల్లి ఉండాలనే ఉద్దేశంతో రేణుక తల్లిదండ్రులు 2022లో తాడిపత్రి చెందిన లక్ష్మితో రెండో పెళ్లి జరిగింది. రెండేళ్ల వరకు పిల్లలను బానే పోషించారు. కుమారుడు మూడో తరగతి ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. చెప్పిన మాట వినడంలేదని రెండు నెలల క్రితం కాల్చి కర్రతో కాళ్లకు, చేతులకు వాతలు పెట్టింది. దీంతో బాలుడి మేనమామ శివ కుమార్ కుటుంబ సభ్యులతో గ్రామానికి వచ్చి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి హెచ్చరించారు. ఇటీవల మరో సారి బాలుడిని కర్రలతో చేతులు, కాళ్లపై కొట్టడంతో వాతలు వచ్చాయి. తండ్రి కుమారుడిని పాఠశాలకు పంపించకుండా ఇంటి వద్దే ఉంచాడు. బాలుడు ఏడ్చుకుంటూ బస్టాండ్ వద్దకు రావడంతో గ్రామస్థులు గమనించి మేనమామకు ఫోన్‌చేసి విషయం చెప్పారు. దీంతో బాలుడి మేనమామ శివకుమార్ మంగళవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దారుణానికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

● తహసీల్దార్ ఎన్.అనిల్‌కుమార్



మరికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ధరణి సమస్యలు పరిష్కారమవుతున్నాయా?

ధరణి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం.

ప్రజలు, రైతుల నుంచి ఎక్కువ శాతం ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి?

భూములు వేరే వ్యక్తులపైకి మారడం, మిస్సింగ్ వంటి వాటిపై ఎక్కువ శాతం దరఖాస్తులు వస్తున్నాయి.

మండలంలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి?

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు?

ప్రజలు వారివారి సమస్యలపై కార్యాలయానికి అధికంగా వస్తున్నారు. త్వరగా సమస్యలను పరిష్కరించలేక పోతున్నాం.

ప్రతీరోజు ఎన్ని భూరిజిస్ట్రేషన్లు అవుతున్నాయి?

ప్రతీరోజు ఐదు నుంచి పది వరకు భూరిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట	కనిష్ట (రూపాయలలో)
వేరుశనగ	84.60	6,120	4,930
పెసళ్లు	6.37	6,571	6,491
ఎర్ర కందులు	261.66	7,469	5,500
తెల్ల కందులు	13.72	7,589	6,200
జొన్నలు	16.66	3,706	3,275
తెల్ల కుసుమలు	1.80	5,259	5,259

న్యూస్ బాక్స్

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్-2025 క్యాలెండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కమ్లానాయక్, ప్రధాన కార్యదర్శి ఫజల్ రహమాన్, మహిళా కార్యదర్శి నర్సమ్మ, టి.రమేష్ తదితరులున్నారు.

దివ్యాంగులను నామినేట్ చేయాలని సంతకాల సేకరణ

ధన్వాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో నామినేట్ చేయాలని కోరుతూ మంగళవారం మండల దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఇతర రాష్ట్రాల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేశారని, అది ఇక్కడ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు కెంచె రంగయ్య, పెంటప్ప, శ్రీహరి తదితరులున్నారు.

పేటలో బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం



పేటలో బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న వెంకోబా

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ కమాన్ వద్ద భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా ఎగురవేసి, మాట్లాడారు. రైతాంగ సంక్షేమం కోసం బీకేఎస్ ఉద్యమిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటప్ప, అనంత్‌రెడ్డి, బాలప్ప, శరణయ్యస్వామి, సూర్యకాంత్, ప్రభు, రంగారెడ్డి తదితరులున్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో మేరెడ్డి చెన్నారెడ్డికి ఘన నివాళి

నారాయణపేట న్యూటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట బీసీ బాలికల వసతిగృహంలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కల్వకుర్తికి చెందిన మేరెడ్డి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. పరిషత్ జిల్లా కన్వీనర్ నరేష్ ఏబీవీపీలో చెన్నారెడ్డి చేసిన సేవలను గుర్తు చేస్తు కొనియాడారు. కార్యక్రమంలో పరిషత్ నాయకులు వెంకటేష్, పల్ల రఘు, ఓంకార్, ఇంతియాజ్ ఉన్నారు.

మహిళా సంఘాలకే సోలార్ ప్లాంట్స్

- రూ.మూడు కోట్లతో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు
- ఏర్పాటుకోసం నాలుగెకరాల ప్రభుత్వ స్థలం చూపిస్తాం
- మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- పేట, ధన్వాడ, మరికల్ ఐకేపీ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



ఐకేపీ సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రూ.మూడు కోట్ల వ్యయంతో చేపట్టబోయే ఒక్క మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాట్లకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణపేట, ధన్వాడ, మరికల్ మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏల్‌లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని గ్రామాల వారీగా గ్రామ సంఘాల పనితీరును సమీక్షించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారన్నారు. మహిళా ఎమ్మెల్యేగా ఉన్న తన నియోజకవర్గంలో రాష్ట్రంలోనే జిల్లా మహిళా సమాఖ్య ద్వారా తొలి మహిళా పెట్రోల్‌బంక్ సీఎం చేతులమీదుగా ప్రారంభించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో నారాయణపేట, ధన్వాడ మండలాలకు ఒకటి చొప్పున సోలార్ ప్లాంట్ల యూనిట్లు మంజూరయ్యాయన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నాలుగు ఎకరాల భూమి అందిస్తుందని, ప్లాంట్ నిర్వహణను మహిళా సంఘం చూసుకోవాలన్నారు. ఒక్కో ప్లాంట్ విలువ రూ.మూడు కోట్లు ఉంటుందని అందులో బ్యాంకు రూ.2.70 కోట్లు రుణం అందిస్తుందని, రూ.30 లక్షలు మహిళా సంఘం చెల్లించాలన్నారు. మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు పొంది సక్రమంగా చెల్లించాలన్నారు. పదేళ్లయినా గ్రామ మహిళా సంఘాలు మార్పులు జరుగకపోవడం తగదని, విధిగా మూడేళ్లకోమారు మహిళా సంఘాలు మార్పులతో కొత్త సంఘాలుగా రూపాంతరం చెందాలన్నారు. మార్చి 15 లోపు గ్రామాల మహిళా సంఘాల్లో మార్పులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. డీపీఎం ఆనందం, సీసీ శ్రీనివాసులు ఉన్నారు.

సమీకృత భవన నిర్మాణ పనులు చేపట్టాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో స్థలాల పరిశీలన



గుండుమాల్‌లో మండల సమీకృత భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి రూరల్/కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన గుండుమాల్ మండల సమీకృత భవన నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గుండుమాల్ మండల కేంద్రంలో రూ.8.80 కోట్ల నిధులతో రెండు ఎకరాల స్థలంలో నిర్మాణం కానున్న మండల సమీకృత భవన నిర్మాణ స్థలంతో పాటు, కొత్తపల్లి మండల కేంద్ర సమీపంలో రూ.8.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న కాంప్లెక్స్ భవన నిర్మాణ స్థలాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం గుండుమాల్-లింగాల్‌చేడ్ బీటీ రోడ్డు పనులను పరిశీలించి, మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కాడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పీఆర్ ఈఈ హీర్యానాయక్, కోస్గి, కొత్తపల్లి తహసీల్దార్లు భాస్కరస్వామి, జయరాములు, కొత్తపల్లి ఎంపీడీవో కృష్ణారావు తదితరులున్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపాలిటీలో కమిషనర్ భోగేశ్వర్లు అధ్యక్షతన ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలో ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎలాంటి సమస్యలు లేని వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. కమిషనర్, టీపీవో సమన్వయం చేసుకుని దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కాగా సదస్సులో పలువురు రియల్ వ్యాపారులు తమ సందేహాలను ప్రస్తావించగా, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ నివృత్తి చేశారు. సదస్సులో టౌన్ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఎల్‌టీపీలు, డాక్యుమెంట్ రైటర్లు, ప్లాటు యజమానులు ఉన్నారు.

మిల్లర్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం

కృష్ణ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి వడ్ల లారీలను తరలించిన మిల్లర్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని చీఫ్ విజిలెన్స్ అధికారి శశిధర్‌రాజు అన్నారు. మంగళవారం కృష్ణ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో పట్టుకున్న వడ్ల బస్తాలు, లారీలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అధిక లాభం కోసం తరలిస్తున్న వడ్లను తరలిస్తున్న రైస్ మిల్లర్ల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డీఎస్పీ వెంకటేష్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ పండరి, ఏఎస్‌వో అనిల్ కుమార్, తహసీల్దార్ ప్రభాకర్ ఉన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టు తగదు

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్‌వాడీ ఏరియాస్ బకాయిలు విడుదల చేసి పెరిగిన వేతనాలు వెంటనే అమలు చేయాలని ప్రజాదర్బార్ హైదరాబాద్ ప్రజావాణికి వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు మంగళవారం అరెస్టు చేయడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్‌లు ఖండించారు. హౌస్ అరెస్టులతో పాటు, స్టేషన్లకు అంగన్‌వాడీలను తరలించడం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ, నిర్బంధ పాలనకు తెర తీస్తుందని ఆరోపించారు.

రాయల వర్ధంతిని విజయవంతం చేయాలి

మక్తల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల తొమ్మిదో తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న రాయల సుభాష్‌చంద్రబోస్(రవన్న) వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కృష్ణ, సలీంలు అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని టీయూసీఐ కార్యాలయంలో వారు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు రాయల సుభాష్ చంద్రబోస్ సేవలను కొనియాడారు. టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు భగవంతు, పీడీఎస్‌యూ నాయకులు భాస్కర్, శారద, కొల్మిరాములు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత



గుండుమాల్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందిస్తున్న మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి

కోస్గి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుండుమాల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్, మోడల్ స్కూల్, పరిధిలోని కొమ్మూర్, బోగారం ఉన్నత పాఠశాలల్లోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న దాదాపు 350 మంది విద్యార్థులకు యువసేతు యూత్ ఫర్ నేషన్ ప్రతినిధులు రాజకీయ నాయకులతో కలిసి పరీక్ష సామగ్రి, ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి జీపీఏ సాధించాలని యువసేతు నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జహీర్, బద్రి రవి, భీమేష్, నగేష్, బాల్‌చంద్రయ్య, వెంకటయ్య, తిరుమలయ్య తదితరులున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసిన కొమరయ్య గెలుపొందడంతో నారాయణపేట సెంటర్ చౌక్‌బజార్‌లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులకు రుణపడి ఉంటామని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

నారాయణపేట టౌన్/కొత్తపల్లి: నల్గొండ, వరంగల్, ఖమ్మం పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజయానికి గుర్తుగా నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యుల సమక్షంలో మిఠాయిలు పంపిణీ చేశారు. నారాయణపేట అంబేడ్కర్ చౌరస్తాతో పాటు, కొత్తపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

దామరగిద్ద తహసీల్దార్‌గా జమీల్

దామరగిద్ద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసిన ఎండీ.జమీల్ దామరగిద్ద తహసీల్దార్‌గా మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన దయాకర్‌రెడ్డి నారాయణపేట ఆర్డీవో కార్యాలయానికి ఏవోగా వెళ్లారు. తహసీల్ సిబ్బంది ఇద్దరినీ సన్మానించారు.



సన్మానం పొందిన దయాకర్‌రెడ్డి, జమీల్

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నారాయణపేట/మక్తల్/మాగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 22వ తేదీ వరకు కొనసాగే ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 16 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 8,791 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 4,156, సెకండియర్‌లో 4,635 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా జరిగే విధంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు రెవెన్యూ కలెక్టర్ బెన్‌షాలం, జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి. మక్తల్‌లో జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా నోడల్ అధికారి, పరీక్షల నిర్వహణ కన్వీనర్ సుదర్శన్‌రావు, కస్టోడియన్ రామస్వామి తెలిపారు. మక్తల్ పట్టణంలో మూడు పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మాగనూరు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీవో సాయిబన్న, చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.రేణుకాదేవి మంగళవారం తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

నారాయణపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 16 ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ అన్ని రకాల పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసిందని ఎస్పీ యోగేష్ గౌతమ్ మంగళవారం తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్, నెట్ సెంటర్స్ లౌడ్ స్పీకర్లు బంద్ చేస్తామన్నారు. కేంద్రాల పరిధిలోని 200 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

నర్సరీ, ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

మాగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండలం ఓబులాపురం గ్రామంలోని నర్సరీని, ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రహమతుద్దీన్ మంగళవారం పరిశీలించారు. కూలీలకు కొలతల ఆధారంగా పనులు చేయాలన్నారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి ప్రతీరోజు నీటి వసతి కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీవో వెంట మాజీ సర్పంచు గొల్ల నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

యు డైస్‌ను అప్‌డేట్ చేయాలి

మాగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల యు డైస్‌ను అప్‌డేట్ చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో అనిల్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని వర్మన్‌పల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, టీచర్స్ హాజరు రిజిస్టర్లతో పాటు, మధ్యాహ్న భోజనం బియ్యం స్టాక్ రిజిస్టర్‌ను, రోజువారి విద్యార్థుల మిడ్‌డే మీల్స్ హాజరును పరిశీలించారు. ఆ తర్వాత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్

మరికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. మంగళవారం మరికల్‌లోని నంది ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మంగలి వేణు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా వచ్చిన జిల్లా అధ్యక్షుడిని శాలువా, పూలమాలతో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంతో పాటు, ప్రతీ గ్రామంలో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి చిన్న నర్సన్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పోలేమోని రమేశ్, శెట్టి మహేందర్, మోహన్‌రెడ్డి, ల్యాబ్ నర్సింహ తదితరులున్నారు.

గోఆధారిత వ్యవసాయం చేయాలి

మక్తల్‌రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గోఆధారిత వ్యవసాయం ఆరోగ్యకరమని డాక్టర్ గౌడజనార్దన్, శాస్త్రవేత్తలు పి.రవికుమార్, శ్రీనివాస్‌లు అన్నారు. మక్తల్ మండలం జక్లేర్ గ్రామ శివారులోని రమాదేవి వ్యవసాయ క్షేత్రంలో గోఆధారిత వ్యవసాయంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌడజనార్దన్, సస్యరక్షణ, ఉద్యానవన శాస్త్రవేత్తలు పి.రవికుమార్, ఎం.శ్రీనివాస్‌లు మాట్లాడారు. పంట విత్తనం నుంచి కోత వరకు పంటలో వచ్చే కీటకాలు, తెగుళ్ల పంట యొక్క ఎదుగుదలకు కావల్సిన పదార్థాలు, కషాయాలు, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, నిమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, పుల్లటి మజ్జిగ, పంచగవ్య, చేప బెల్లం ద్రావణం, సబ్ సాయిల్ వాడకంపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. గోఆధారిత పిడకల తయారీపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో గోసేవ ప్రముఖ్ గంగుల ముకుందారెడ్డి, అనకులం గోకులం గోశాల రఘు, ప్రసన్నభట్, రైతులు కావలి వెంకటేష్, శేఖర్‌రెడ్డి, ప్రాణేష్‌కుమార్, జగదీష్‌శెట్టి తదితరులున్నారు.

సిద్ధలింగేశ్వరస్వామి జాతర వాల్‌పోస్టర్ విడుదల



జాతర వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మాగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడుగమ్ము గ్రామంలో సిద్ధలింగేశ్వర పక్షమాద్రి సంస్థాన విరక్త మఠంలో ఈనెల 15 నుంచి 18 వరకు సిద్ధలింగేశ్వర మహాస్వామి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నామని మఠం పీఠాధిపతి పంచమసిద్ధలింగ మహాస్వామి తెలిపారు. మంగళవారం మఠంలో స్వామి జాతర మహోత్సవ వాల్‌పోస్టర్‌ను వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈనెల 15న ఉదయం గోశాల ప్రారంభం, గోపూజ, ఉచిత ఆరోగ్య కేంద్రం, రక్తదాన శిబిరం, సాయంత్రం సిద్ధిలింగేశ్వర ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం, రాత్రి ఎనిమిది గంటలకు విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు పాదపూజ, 16న ఉదయం రైతుల సమావేశం, 10:30 గంటలకు ఉచిత సామూహిక వివాహాలు, సాయంత్రం 5:30 గంటలకు రథోత్సవం, రాత్రి ధర్మసభ తులాభారం, ఈనెల 18న ఉదయం సిద్ధలింగేశ్వర మహాస్వామి డోలారోహణం, 1111 ముత్తైదువులకు ఒడినింపే కార్యక్రమం, సాయంత్రం సిద్ధిలింగేశ్వర పాఠశాల ఏడవ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామని స్వామిజీ తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, వివిధ పార్టీల నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మక్తల్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మక్తల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గణేష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, ఎం.నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



కోస్గి మండలం సర్జఖాన్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఊట్కూర్ మండలం మగ్దుంపూర్ పాఠశాలలో..



దామరగిద్ద మండలం కానుకుర్తి సీపీఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోస్గి/ఊట్కూర్/నారాయణపేట రూరల్/మక్తల్ రూరల్/దామరగిద్ద/కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లోని పాఠశాలల విద్యార్థులు మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేట జడ్పీహెచ్‌ఎస్‌లో కలెక్టర్‌గా స్వరూప, డీఈవోగా అక్షయ, అడిషనల్ కలెక్టర్‌గా వంశీ, ఎంఈవోగా ప్రణీతతో పాటు, మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అలాగే, గుండుమాల్ మండల పరిధిలోని హన్మాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా మోక్ష, ఎంఈవోగా నవీన్‌తో పాటు మరికొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్‌ఎం కృష్ణగౌడ్, నర్సిములు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, సాయప్ప, నరేష్, అనంతయ్య తదితరులున్నారు.

అదేవిధంగా, ఊట్కూర్ మండలం మగ్దుంపూర్ పాఠశాల హెచ్‌ఎంగా ప్రణీతతో పాటు మరికొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సాయంత్రం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఎస్.హాజమ్మ హాజరై, మాట్లాడారు. పాఠశాల చైర్‌పర్సన్ కె.కృష్ణవేణి, హెచ్‌ఎం తిమ్మప్ప, ఉపాధ్యాయులు బన్నేష్, సి.అరుణ, నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శ్రీరామ్‌నగర్ పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు.

నారాయణపేట మండలం కోటకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా సాహితి, కలెక్టర్‌గా మంజుల, డీఈవోగా భార్గవి, ఎంఈవోగా సుమశ్రీ, పీఈటీగా ఎన్.శివప్రసాద్‌లు వ్యవహరించారు.

మక్తల్ మండలం కర్ని గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో కలెక్టర్‌గా పుష్పలత, డీఈవోగా కీర్తన, ఎంఈవోగా కార్తీక్, జీహెచ్‌ఎంగా వెంకటేష్‌లు వ్యవహరించారు. మంతన్‌గోడ్ పాఠశాలలో కలెక్టర్‌గా వరలక్ష్మి, డీఈవోగా విష్ణు, డిప్యూటీ డీఈవోగా నవీన్, ఎంఈవోగా విశ్వతేజ, గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా అనిల్ విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, అమీరుద్దిన్, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ స్వప్న, ఉపాధ్యాయులు నరేష్, శిరీష, మీరా, పొన్నమ్మ, లక్ష్మి ప్రియ పాల్గొన్నారు.

దామరగిద్ద మండలం కానుకుర్తి సీపీఎస్‌లో హెచ్‌ఎంగా నందకిశోర్, డీఈవో నరేష్, కలెక్టర్‌గా నిత్యశ్రీ, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులై విద్యాబోధన చేశారు. విద్యార్థులను హెచ్‌ఎం రవి కుమార్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, మహేంద్రమ్మ, ఆసియాబేగం అభినందించారు.

కొత్తపల్లి మండలం భూనీడు జడ్పీహెచ్‌ఎస్‌లో కలెక్టర్‌గా నర్వ అశోక్, హెచ్‌ఎంగా వి.గాయత్రి, డీఈవోగా సనాబేగం, డిప్యూటీ డీఈవోగా కే.శివ, ఎంఈవోగా యేసమ్మ వ్యవహరించారు. హెచ్‌ఎం డాక్టర్ చెన్నకేశవరెడ్డి, వరలక్ష్మి, శ్రీలత, భానుప్రకాష్‌రెడ్డి, అలీ, నర్సింహులు, వనజ, నరేష్, సుజాత తదితరులున్నారు.



స్వయం పరిపాలన దినోత్సవంలో కర్ని పాఠశాల విద్యార్థులు



కొత్తపల్లి మండలం భూనీడు జడ్పీహెచ్‌ఎస్‌లో..



కోటకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు